

మత్తుకు దూరంగా ఉండాలి

యువత మత్తుకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ అన్నారు.

- 8లో▸



పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్

కాకతీయ వర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. చివరి గడువు ఫిబ్రవరి 12.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

32^0 / 17^0

వాతావరణం

ఉదయం పొగమంచుతో చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సోమవారం(నేడు) 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈకార్యక్రమంలో హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల ప్రయాణికులు 9959226047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

ప్రతిభా సేవా పతకానికి ఫైర్‌మెన్ జనార్దన్ ఎంపిక



హన్మకొండ అర్బన్: హనుమకొండ ఫైర్ సర్వీస్ విభాగంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న కారుకురి జనార్దన్ కేంద్ర హోంశాఖ ప్రకటించిన ప్రతిభా సేవా పతకానికి ఎంపికయ్యారు. విధి నిర్వహణలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ఫైర్ స్టేషన్లలో పనిచేసిన జనార్దన్ ఎన్నో అగ్నిప్రమాదాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా నివారించారు. గతంలో వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన రెస్క్యూ ఆపరేషన్‌లో, ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో వచ్చిన వరదల్లో రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొని పలువురి ప్రాణాలు కాపాడారు. జిల్లా అధికారులు గుర్తించి ఆయనను ప్రతిభ సేవా పురస్కారాలకు సిఫార్సు చేశారు. పతకం అందుకోనున్న జనార్దన్‌ను రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో పాటు ఫైర్ సర్వీస్ విభాగం ఉన్నతాధికారులు, సహచరులు అభినందించారు.

కార్పొరేటర్లకు 'నజరానా'

వరంగల్ అర్బన్: నగరంలోని డివిజన్లలో ఓ వైపు రహదారులు, డ్రెయినేజీలు ఛిద్రమైపోతున్నాయి. మరోవైపు నగరవాసులు పన్నుల రూపేణా చెల్లించిన నిధులు పక్కదారి పడుతున్నాయి. అభివృద్ధి పనులకు నిధుల కొరత చూపే అధికార గణం.. దారి మళ్లుతున్న నిధులపై కించెత్తైనా మాట్లాడడం లేదు. నగర పరిధిలో 66 మంది కార్పొరేటర్లకు ఒక్కొక్కరికి రూ.33 వేలు విలువైన వన్ ప్లస్ కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్లను ఈ–టెండర్ పెట్టి కొనుగోలు చేశారు. రూ.21,78 లక్షలు వెచ్చించారు. కొద్ది రోజుల్లో జనరల్ ఫండ్ నిధులను ఆ కంపెనీకి చెల్లించనున్నట్లు సమాచారం. మొబైల్ ఫోన్లను కార్పొరేటర్లకు పంపిణీ చేశారు. గతంలో శ్యాంసంగ్ ఫోన్లు పంపిణీ చేశారు. ప్రజల సొమ్ముతో ఇలా కానుకలివ్వడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాలకవర్గం తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్పీడీసీఎల్ సీఎండీకి అవార్డు



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి గవర్నర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న అధికారులను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి చేస్తున్న విశేష కృషికి ఆయనను ఈపురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వరుణ్‌రెడ్డి ప్రశంసపత్రం అందుకున్నారు.

నేడు వరంగల్ ప్రజావాణి

వరంగల్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వినతులు ఇచ్చేందుకు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు రావాలని ఆమె కోరారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగరపాలక సంస్థ గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

29న గ్రేటర్ కౌన్సిల్ సమావేశం

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ అలివేలు తెలిపారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు, కమిషనర్, వింగ్ అధికారులు పాల్గొంటారు.





బోల్తా పడిన భారీ ట్రైలర్ ట్రక్



ఆటో కింద ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్ రాపర్తి సాగర్

నలిగిన వలస బతుకులు

పొట్టకూటి కోసం వస్తే నలుగురి ప్రాణం పోయింది

- ఐదు రోజులక్రితమే మామునూరుకు వచ్చిన కుటుంబం
- వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవనోపాధి
- ట్రైలర్ ట్రక్ రూపంలో కబళించిన మృత్యువు
- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్ ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..

పొట్టకూటి కోసం ఐదు రోజులక్రితమే రాష్ట్రం విడిచి వచ్చారు. డేరాలు వేసుకుని ఇనుప పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో ఊరిలో వీటికి గిరాకీ బాగుందని తెలుసుకున్న ఆ కుటుంబం ఆటోలో వెళ్తుండగా బయల్దేరిన పది నిమిషాల్లో 18 టైర్లతో కూడిన ట్రైలర్ ట్రక్ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విగతజీవులయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్‌చౌహాన్ (45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (18), కుమారుడు ఖన్నా చౌహాన్ (7)గా గుర్తించారు. సంతోశ్ భార్య చామాబాయి, కుమారుడు ముఖేశ్ చౌహాన్‌తో పాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్రరాజుకు గాయాలయ్యాయి.

- సాక్షి, వరంగల్

- పూర్తి వివరాలు 8లో▸



రోడ్డు పక్కన పడిపోయిన ఆటో, ఐరన్ రాడ్లు



మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

సంక్షేమానికి భరోసా..



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



పరేడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా



గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా తదితరులు

- వేగంగా అభివృద్ధికి ప్రణాళికలు
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి వేగంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ దళాల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించడంతో పాటు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్తం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పథకాలను అర్హులకు అందేలా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నట్లు చెప్పారు. బాలికల కోసం ప్రత్యేక పాఠశాలల ఏర్పాటుకు నిధులు కేటాయించామని, మహిళా సంఘాలకు రూ.100 కోట్ల ఆర్థికసాయం అందించామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, నీటి వనరుల అభివృద్ధికి నూతన ప్రాజెక్టుల అమలు కొనసాగుతోందని వివరించారు. విద్యాశాఖ ద్వారా 2024లో 187 ఖాళీలకు 169 భర్తీ చేసినట్లు తెలిపారు. పౌరసరఫరాల శాఖ ద్వారా 146 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 96,036 టన్నుల ధాన్యాన్ని 22,628 మంది రైతుల నుంచి సేకరించినట్లు చెప్పారు. అలాగే పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు 456 మంది రైతులకు 1,239 ఎకరాల్లో అనుమతులు ఇచ్చామన్నారు. ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయం వద్ద మాఢవీధుల నిర్మాణానికి రూ.30కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. 50 ఏళ్ల తర్వాత నగరానికి కొత్త మాస్టర్ ప్లాన్ వచ్చిందని, రూ.95 కోట్లతో నిర్మించుకున్న కాళోజీ కళాక్షేత్రాన్ని ఇటీవల ప్రారంభించుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు. వీటితోపాటు సంక్షేమ శాఖల ద్వారా పథకాలు అమలు చేస్తూ యువతను ప్రోత్సహించేలా నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని వివరించారు. స్మార్ట్ సిటీ పనులు వేగంగా సాగుతున్నాయని, దాదాపు చివరి దశలో ఉన్నట్లు చెప్పారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల స్టాల్స్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య సమరయోధుడిని సన్మానిస్తున్న కలెక్టర్



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని, ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. ఆదివారం రాంనగర్‌లో నాలుగు సంక్షేమ పథకాలకు ఎంపికైన అర్హులకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. 1,965 మంది రైతులకు రైతు భరోసా ద్వారా రూ.2.76 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 21 మందికి రూ.6వేల చొప్పున, ఇందిరమ్మ ఇళ్లు 140 కుటుంబాలకు మంజూరు చేసినట్లు చెప్పారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం.. సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులు ఆందోళన చెందవద్దని పథకాల అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. మండల ప్రత్యేకాధికారి అనురాధ, తహసీల్దార్ విక్రమ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ సునీల్‌కుమార్, ఎంపీఓ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న రవీందర్‌రావు

సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి

ఎల్కతుర్తి: ప్రజాపాలనలో పేర్కొన్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తామని 'కుడా' చెర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. ఆదివారం ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్‌లో రైతు భరో సా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత పాలకులు ఎన్నో మాటలు చెబుతారని నమ్మి ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి నాలుగు పథకాలు తప్పనిసరిగా అందుతాయని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎవరికైనా రాకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, విడతల వారీగా మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకరన్న అన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తారని భరోసా నిచ్చారు. స్థానిక నాయకులు సైతం అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ జగత్‌సింగ్, ఏఓ రాజ్‌కుమార్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి

ఎమ్మెల్యేపై కోడిగుడ్డు విసిరిన కాంగ్రెస్ కార్యకర్త

శాయంపేట : మండల పరిధి గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా వచ్చిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై కాంగ్రెస్ కార్యకర్త బొమ్మకంటి ప్రశాంత్ కోడిగుడ్డు విసిరాడు. దీంతో ఆ కోడిగుడ్డు ఎమ్మెల్యే వెనుక ఉన్న ఫ్లెక్సీకి తగిలి కిందపడి పగిలిపోయింది. కోపోద్రిక్తులైన కార్యకర్తలు ఫ్లెక్సీలో ఉన్న సదరు వ్యక్తి ఫొటో చించివేశారు. అక్కడే ఉన్న పోలీసులు ప్రశాంత్‌ను స్టేషన్‌కు తరలించారు. సదరు యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.



ప్రశాంత్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

సమాన అవకాశాలు దక్కాలి

- నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- గ్రేటర్ వరంగల్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

వరంగల్ అర్బన్: సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఆదివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆమె జాతీయ జెండా ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలిచిన కార్పొరేటర్లు, బల్దియా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్యాగాల పునాదులపై సాధించుకున్న దేశ స్వాతంత్ర్యానికి అసలైన సార్థకత చేకూర్చేందుకు మహనీయుల ఆశలు, ఆశయాలు నెరవేరాలని పేర్కొన్నారు. బల్దియా ఆధ్వర్యాన సమగ్ర అభివృద్ధికి అమలు చేస్తున్న కార్యక్రమాలను మీ ముందుంచడం కర్తవ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. బల్దియా ఆధ్వర్యంలో సాధారణ నిధులు రూ.111.89 కోట్ల వ్యయంతో 957 అభివృద్ధి పనులు చేపట్టగా రూ.41 కోట్ల విలువైన 478 పనులు పూర్తయ్యాయని, మిగిలిన వి పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.7.10 కోట్ల వ్యయంతో 54 పనులు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.187 కోట్లు విడుదల చేసిందని వివరించారు. బల్దియా ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులు వేగంగా పూర్తిచేసి వేసవి సెలవుల్లోగా అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు విజయ లక్ష్మి, పద్మ, అరుణ, చందన, రమా తేజస్వి, అరుణకుమారి, బసవరాజు శిరీష, లోహిత, మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, స్వరూపరాణి, అనిల్‌కుమార్, శిభారాణి, అరుణ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న కమిషనర్, మేయర్ తదితరులు

అనర్హులను ఎంపిక చేస్తే.. రద్దు!

- త్వరలోనే రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం
- మౌనంగా ఉంటే భవిష్యత్ ఉంటుంది
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హసన్‌పర్తి: అనర్హులకు పథకాలను ఎంపిక చేస్తే రద్దు చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 606 మండలాల్లో ఈకార్యక్రమాన్ని ప్రారంభించామని, దరఖాస్తుల ఎంట్రీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు ప్రారంభించలేక పోయామని, ఫిబ్రవరి మొదటి వారంలో అన్ని గ్రామాల్లో అమలు చేస్తామన్నారు. ఈపథకాలకు రూ.45వేల కోట్ల భారం పడుతుందని, ప్రభుత్వం అప్పుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల మేరకు పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చెడగొట్టకుండా మౌనంగా ఉంటే భవిష్యత్(మరో 15 ఏళ్ల తర్వాత) ఉంటుందని, ప్రతి పక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. త్వరలోనే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తామని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బ్యాంకుల్లో అప్పులు ఉన్న రుణాలను మాఫీ చేసినట్లు వెల్లడించిన మంత్రి.. ఇందుకు ప్రభుత్వంపై రూ.21 వేలకోట్లు భారం పడిందని వివరించారు. సుమారు 25.65 లక్షల మంది రైతులు లబ్ధిపొందినట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సాగుకు యోగ్యమైన భూములకే 'రైతు భరోసా' పథకం వర్తింపజేస్తామన్నారు. గత ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించి రాష్ట్రాన్ని దోచుకుందని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వారు చేసిందేమీ లేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కార్ హామీలను నేరవేరుస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ రామకృష్ణారావు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావీణ్య ప్రసంగించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ వినయ్‌కృష్ణారెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్‌నర్సింహారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై మంత్రి కొండా సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు



లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న మంత్రులు

ఉత్తములకు ప్రశంస పత్రాలు


హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డికి మెడల్ అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగులు ఆదివారం ప్రశంసపత్రాలు అందుకున్నారు. హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు.

– సాక్షి, హన్మకొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్


బాలాజీ ఇన్‌స్పెక్టర్ | రాజేందర్, హౌజింగ్ నోడల్ అధికారి | అశోక్‌కుమార్, డీవైఎస్‌ఓ | లక్ష్మీ రమాకాంత్, డీపీఓ


వై.శ్రీధర్, మేనేజర్, ఐడీఓసీ | జోత్స్న ఏసీ, జీడబ్ల్యూఎంసీ | కె.ప్రసన్నరాణి, డీసీ, జీడబ్ల్యూఎంసీ | బి.రమేశ్, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ | సంగీత, నాయబ్ తహసీల్దార్ | అమరేందర్, సీనియర్ అసిస్టెంట్ | వనిత, సీనియర్ అసిస్టెంట్ | ఎండీ నిజాముద్దీన్, జూనియర్ అసిసెంట్ | వెంకట్రాజం, డ్రైవర్ | అరవింద్, రికార్డు అసిస్టెంట్ | విఠల్, ఎలక్షన్ ఆపరేటర్ | సీహెచ్ రాము, డ్రైవర్


మిర్యాల ఉమ, సీనియర్ అసిస్టెంట్ | సీహెచ్ రాజు, రికార్డు అసిస్టెంట్ | కె.శంకర్, గిర్దావర్ | పి.సతీశ్, జూనియర్ అసిస్టెంట్ | కె.శైలజ, టైపిస్ట్ | సుధాకర్‌రెడ్డి, ఐఆర్‌సీ | వై.సతీశ్ ఇన్‌స్పెక్టర్ | కె.సతీశ్, ఎస్సై | వై.కాసులు, మహిళా ఎస్సై | కె.స్వరూప, కానిస్టేబుల్ | ఎల్.పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ | వంశీకుమార్, ఎస్సై


జి.వేణుగోపాల్, ఎంవీఐ | కిరణ్మయి, మహిళా ఎస్సై | ఎం.సంజీవరావు, ఇన్‌స్పెక్టర్, ఆర్‌పీఎఫ్ | బాలాజీ వరప్రసాద్, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ | సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ | ఎం.రమేశ్, ఎస్సై | పి.వంశీకృష్ణ, కానిస్టేబుల్ | వై.సరస్వతి, కానిస్టేబుల్ | లక్ష్మణ్, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ | పి.లలిత, హెచ్‌డబ్ల్యూఓ | అజారుద్దీన్, డీసీఓ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ | సునీత, కోఆర్డినేటర్


కవిత, జూనియర్ లెక్చరర్ | అరుణ కాంతి, లెక్చరర్ | సంగీత, సీనియర్ అసిస్టెంట్ | సతీశ్, జూనియర్ అసిస్టెంట్ | యాదగిరి, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ | శ్రీనివాస్ చక్రవర్తి, ట్రైనింగ్ ఆఫీసర్ | ఎల్.దయాకర్, ఫైర్ ఆఫీసర్ | జి.శ్రీకాంత్, ఫైర్ మెన్ | కృష్ణవేణి, హార్టికల్చర్ సూపరింటెండెంట్ | సురేందర్‌బాబు, టెక్నికల్ సబార్డినేట్ | టి.కవిత, మెడికల్ ఆఫీసర్ | మౌనిక, జూనియర్ అసిస్టెంట్ సర్జన్


తాటి సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్ | బి.చంద్రకళ, లాయాల్టీ ఇన్‌స్పెక్టర్ | రవిబాబు, పంచాయతీ ఆఫీసర్ | స్వాతి, జూనియర్ అసిస్టెంట్ | కె.హరిత, పంచాయతీ సెక్రటరీ | వి.పల్లవి, శాస్త్రవేత్త | శ్రావణ్, ఆఫీస్ సబార్డినేట్ | శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ | శారద, అడిషనల్ డీఆర్‌పీ, డీఆర్డీఏ


సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్ రాజుకు ప్రశంస ప్రతం అందజేస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా, కలెక్టర్

క్లుప్తంగా

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫెల్లోషిప్స్ కలిగిన విద్యార్థులు యూజీసీనెట్, సీఎస్ఐఆర్ నెట్, సీడ్, డీఎస్‌టీ, ఎన్ఈఎఫ్‌డబ్ల్యూడీ, డీఎస్‌టీ–ఇన్‌స్పైర్ లేదా ఎఫ్ఐపీ, క్యూఐపీ టీచర్ ఫెల్లోషిప్స్ తదితర నెట్, గేట్, జీప్యాట్ నేషనల్ లెవల్ టెస్ట్ స్కోర్స్ నెట్ కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లను సంబంధిత కార్యాలయంలో ఫిబ్రవరి 12 లోపు అందజేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బోటనీ 6, కెమిస్ట్రీ 3, జీయాలజీ 1, మ్యాథ్‌మెటిక్స్ 5, ఫిజిక్స్ 2, జువాలజీ 11 సీట్లు ఉన్నాయని వివరించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కేయూ క్యాంపస్: యువత మత్తుకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో మత్తు పదార్థాల నియంత్రణపై రెండ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువత ఇందులో పాల్గొనగా.. ముగింపు సమావేశంలో ఈసం నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత తమలోని నైపుణ్యాలను వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి సమాజానికి ఉపయోగించుకోవాలన్నారు. రిసోర్స్‌పర్సన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ కమ్యూనిటీ మొబలైజేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్, యాంటీ నార్కోటిక్స్ సీఐ రవీందర్, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సైకియాట్రిస్ట్ విభాగం డాక్టర్ సాయికిరణ్, ప్రొఫెసర్ మురళి, డాక్టర్ నవీన్, గణిత విభాగాధిపతి డాక్టర్ భారవిశర్మ, హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మధు, నెహ్రూ యువ కేంద్రం సూపరింటెండెంట్ బానోత్ దేవీలాల్, న్యాయవాది మహేందర్ పాల్గొన్నారు.

ఎస్సార్‌లో 'షణ్ముఖ ప్రియ' హంగామా

- ఆకట్టుకున్న ప్రదర్శన
- అదిరిన విద్యార్థుల ర్యాంప్‌వాక్
- ముగిసిన స్పార్కిల్ వేడుకలు


పాడుతున్న సింగర్ షణ్ముఖప్రియ

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్పార్కిల్ వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాయని షణ్ముఖ ప్రియ బృందం హంగామా చేసింది. షన్ముఖ పాటలకు వేదిక కింద ఉన్న విద్యార్థులు స్టెప్పులు వేశారు. ముంబాయి సినిమాలోని 'హమ్మ .. హమ్మ' అనే పాటకు విద్యార్థుల కేరింతలతో ఆ ప్రాంతం మార్మోగింది. తొలుత కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆదిరింది. వివిధ వేషధారణలో విద్యార్థులు ర్యాంప్‌పై ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులతో మానసిక వికాసం పెంపొందుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డాక్టర్ సుధాకర్, ప్రోగ్రాం కన్వీనర్లు శశిధర్‌రెడ్డి, వాణిశ్రీ, భావన తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న వరదారెడ్డి

ఉత్సాహంగా 'ఎట్ హోం'

హన్మకొండ అర్బన్: గణతంత్ర వేడుకల్లో భాగంగా హనుమకొండ కలెక్టర్ ఆధ్వర్యాన సంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఎట్ హోం.. తేనీటి విందు కార్యక్రమం ఆదివారం రాత్రి కలెక్టరేట్‌లో ఉత్సాహంగా సాగింది. చిన్నారుల ఆటాపాటలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దంపతులు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీతానాజీ వాఖడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


ఎట్ హోం కార్యక్రమంలో సీపీ, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్

నలిగిన వలస బతుకులు

ట్రైలర్ ట్రక్ రూపంలో నలుగురిని కబళించిన మృత్యువు

- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు..


ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు

సాక్షి, వరంగల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువ్వురు సంతోశ్ చౌహాన్ కుటుంబానిది రెక్కాడితే గాని డొక్కాడనీ కుటుంబం. కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ జీవనాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఐదు రోజుల క్రితం మామునూరుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన అతడి అన్న కొడుకు సుమీర్ కుటుంబం డేరా వేసుకొని జీవనం వెళ్లదీస్తుండడంతో వారి పక్కనే మరో డేరా వేసుకొని పని చేసుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఒక్క దగ్గరే ఉంటుండడంతో వచ్చిన గిరాకీ కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అక్కడికి వచ్చిన ఇతరుల ద్వారా లోహిత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే మామునూరు బెటా లియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు కూతవేటు దూరంలో 18 టైర్లతో కూడిన ట్రైలర్ ట్రక్ అతివేగంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న భారీ ఇనుప రాడ్లు ఎగిరి కాస్త ముందు ఉన్నమరో ఆటోపై ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నువ్వురు సంతోశ్ చౌహాన్(45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్(18), కిరణ్ చౌహాన్(18) అక్కడికక్కడే మ రణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమా రుడు ఖన్నా (8) చనిపోయాడు. ఇనుపరాడ్లు పడడంతో మృతదేహాలు గుర్తుపట్టరాకుండా ఛిద్రమయ్యాయి.

మూడు జేసీబీలతో ఇనుపరాడ్ల తొలగింపు

ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులకు అప్పటికే ట్రక్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ జామైంది. దీనికితోడు ఇనుపరాడ్లు తీయడం సవాల్‌గా మారింది. సమీపంలోని మూడు జేసీబీలను తీసుకొచ్చారు. ఇటు ఆర్టీఓ జంక్షన్ వైపు హైవే రహదారిని మూసివేసి వాహనాలు రాకుండా చూశారు. ఆ జేసీబీల సాయంతో ఇనుప రాడ్లలో చిక్కుకున్న ఐదుగురు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అరగంటకు పైగా సమయం తీసుకుంది. డీఆర్ఎఫ్ బృందాలు కూడా పనిచేశాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌ల్లో వారిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఆ తర్వాత రహదారికి అడ్డుగా ఉన్న ట్రైలర్ ట్రక్కును జేసీబీల సాయంతో ఎడమవైపునకు తోసేశారు. రహదారిపై పడి ఉన్న ఇనుప రాడ్లను కుడివైపున పడేశారు. ఆ తరువాత ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. ఘటనాస్థలిని కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

నిన్న వెళ్తే.. ఈ ఘోరం జరిగి ఉండేది కాదు..

మామునూరు ప్రధాన రహదారికి ఆనుకొని వీరు వేసుకున్న డేరా బోసిపోయింది. ఉదయం 11 గంటల వరకు సంతోషంగా ఉన్న ఆ ఫ్యామిలీ 20 నిమిషాల వ్యవధిలో ఘోర ప్రమాదం బారినపడడంతో అక్కడున్న వారు అయ్యో పాపం అని చర్చించుకోవడం కనిపించింది. 'ఐదు రోజుల పాటు అక్కడే ఆడుతూ పాడుతూ గడిపిన సంతోశ్ కుటుంబం శనివారం సాయంత్రమే లోహితకు వెళ్లాల్సి ఉండే. బొల్లికుంట మీదుగా వెళ్తే త్వరగా వెళ్లొచ్చని చెప్పాం. తెలిసిన వారు గవిచర్ల క్రాస్ నుంచి రమ్మని చెబుతున్నారనడంతో ఆటోను రూ.1,000లకు కిరాయి అడిగితే ఏమీ లేనివారని రూ.500లకు మాట్లాడించి పంపించాం. నిమిషాల వ్యవధిలోనే ఆ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడడంతో మాకు కన్నీళ్లు ఆగడం లేదు' అని అక్కడే టైలర్ దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తి వాపోయాడు.

నలుగురిని బలిగొన్న మద్యం మత్తు..

మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ రాజస్తాన్ వాసి యోగిందర్ సింగ్ తీవ్ర మద్యం మత్తులో ఉన్నాడు. అతడికి పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 ఎంజీ/100 మిలీ రీడింగ్ నమోదైంది. ఇతడి వల్ల నలుగురి ప్రాణాలు పోయాయి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, డ్రంకన్ డ్రైవ్ వల్లనే జరుగుతున్నాయని, తమకు ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల ప్రాణాలు తీస్తున్నారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ అన్నారు. ఇలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రూ.200 డీజిల్ పోయించుకున్నారు



ఆరుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో మా పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోయించుకున్నారు. ఫోన్ పే పనిచేయకపోవడంతో కాసేపు ఆగారు. చివరకు డబ్బులిచ్చి హైవేపైకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే ట్రైలర్ ట్రక్కు అతివేగంతో వచ్చి చేసిన ప్రమాదంతో వీరి ఆటో నుజ్జునుజ్జయింది. మేం పోయేసరికే ఆ ఇనుప రాడ్లు పడి అందులో చిక్కుకున్న వారి ఆర్తనాదాలు మాకు వినిపించాయి. ఆ ఇనుపరాడ్లు తీద్దామంటే బాగా బరువు ఉండడంతో తీయలేకపోయాం.

– జాకీర్, పెట్రోల్‌బంక్ సిబ్బంది

గంట ముందు మాట్లాడా..





గంట ముందు వరకు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న లోహిత గ్రామానికి వెళుతున్నామని, వచ్చే ఆదివారం కలుసుకుందామని చెప్పారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.

– సుమీర్, సంతోశ్ అన్న కుమారుడు

మెరుగైన వైద్యం అందించండి

- క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద


ఘటనాస్థలిలో కలెక్టర్ సత్యశారద


క్షతగాత్రులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఎంజీఎం: మామునూరు వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఎంజీఎం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కాగా, స్వల్ప గాయాలపాలైన ఆటో డ్రైవర్ షకీల్‌ను వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం పూర్తి చేసిన మృతదేహాలను, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో ఎంజీఎం పరిపాలనాధికారులతోపాటు వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులు దగ్గరుండి ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపించారు.

మంత్రి సురేఖ పరామర్శ..

ఆస్పత్రిలోని క్షతగాత్రులను సాయంత్రం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.